# శేషప్రశ్న



సమయం : ఉదయం 10 గంటలు

స్థలం : గాంధీ చౌక్

రోడ్డు కడ్డంగా పరిగెడుతున్న పిల్లవాణ్ని చూసిన రోడ్డు మీది జనం కంగారుపడ్డారు. అంతలోనే క్షణాల్లో జరిగిపోయింది ఆ ఆక్సిడెంట్.

పదేళ్లకే నూరేళ్లు నిండిన ఆ బాలుని చూసిన అందరి గుండెలు భగ్గుమన్నాయి. అందరూ ఆ లారీడ్రైవర్‌పై పడ్డారు. అతన్ని బయటికి లాగి తమ శక్తికొద్దీ కొట్టసాగారు, తన్నసాగారు.

అతడు తన తప్పేమీ లేదని, పిల్లాడే హఠాత్తుగా రోడ్డు మధ్యకి రావడంతో ఇలా జరిగిందని వేడుకుంటున్నాడు. చేతులెత్తి నమస్కరిస్తున్నాడు. జనం కాళ్లు పట్టుకుంటున్నాడు. అయినా జనం శాంతించలేదు. పోలీసులు వచ్చేదాకా అతన్ని కొడుతూనే ఉన్నారు.

●

సమయం : ఉదయం 10 గంటలు

స్థలం : గాంధీ చౌక్

రోడ్డుపై హఠాత్తుగా అరుపులు వినిపించడంతో అందరూ అటుగా చూశారు.

అప్పుడే జరిగిందా సంఘటన!

జగ్గూదాదా చేతిలోని కత్తి ఆ యువకుడి కడుపులో దూసుకుపోయింది.

జనం హడావుడిగా పరుగెత్తసాగారు. క్షణాల్లో రోడ్డు నిర్మానుష్యమైపోయింది. షాపులన్నీ మూతపడ్డాయి.

జగ్గూదాదా తన కత్తికి అంటుకొన్న రక్తాన్ని హతుడు చొక్కాకే తుడిచి, తన కారులో వెళ్లిపోయాడు.

పోలీసులొచ్చిన తర్వాత జనం పోగవసాగారు.

●

ఈ రెండు సంఘటనలకు ప్రత్యక్ష సాక్షి అయిన ఎనిమిదేళ్ల చైతన్యకు మాత్రం ఓ విషయం అర్థంకాలేదు...

లారీడ్రైవర్ తన తప్పు లేదని మొత్తుకుంటున్నా అతన్ని జనం చావగొట్టారు. అదే జనం ఒక రౌడీ నడిరోడ్డుపై హత్య చేస్తే అందరూ పారిపోయి దాక్కొన్నారు.

రెండు సంఘటనల్లోనూ ప్రాణనష్టం జరిగినా- జనం ప్రవర్తనలో 'తేడా' మాత్రం అతనికి అర్థంకాలేదు. అతనికి అర్థం అవడానికి మరో అయిదేళ్లు పట్టవచ్చేమో కాని, ప్రజల ప్రవర్తన మారడానికి మాత్రం ఇంకా ఎన్నేళ్లు పడుతుందో?!

అసలు మార్పు వస్తుందా?

లేదా 'జవాబు లేని ప్రశ్న'గానే మిగిలిపోతుందా?

●

**'భావ తరంగిణి' మాసపత్రిక ... నవంబర్' 2000**